క్రీడల నిర్వహణ అభినందనీయం

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో కొనసాగుతున్న డీఎస్ స్మారక క్రీడాపోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డీఎస్ ప్రారంభించిన నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ద్వారా అధ్యక్షుడు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ వీటిని నిర్వహించడం అభినందనీయమన్నారు. గత పాలనలో అభివృద్ధి కుంటుపడిందని ఎద్దేవా చేశారు. బోధన్ నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలల మరమ్మతులకు రూ.1.50 కోట్లు కేటాయించామన్నారు. డీఎస్ మంత్రిగా ఉన్నప్పుడు బాసరలో ఐఐఐటీ ఏర్పాటు చేస్తే భారాస ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. తన వంతుగా టోర్నీ నిర్వహణకు రూ.50 వేలు ఇస్తున్నట్లు ప్రకటించారు. సొసైటీ సభ్యులు సాయిలు, పీడీలు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్

పల్లె ప్రగతి పనులు భేష్

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: మునిపల్లిలో గత పంచాయతీ పాలకవర్గం చేపట్టిన పనులు భేష్ అని పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో బుధవారం పల్లె ప్రగతి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ గ్రామాన్ని జాతీయ పంచాయతీ గుడ్ గవర్నర్ పురస్కారానికి ప్రతిపాదనలు పంపగా ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, పరిశుభ్రత, అంతర్గత రోడ్లను పరిశీలించారు. వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్ తదితరులున్నారు.



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న జాన్ వెస్లీ

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

శ్రీరాంసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువ నుంచి 33,238 క్యూసెక్కులు రాగా, రెండు గేట్లతో 6,248 క్యూసెక్కులు గోదావరిలోకి వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 80.501 టీఎంసీల నీటి మట్టంతో ఉంది. కాకతీయ కాలువ ద్వారా 6800, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాలువ ద్వారా 50, ఇందిరమ్మ వరదకాలువ ద్వారా 18,000, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం

ఇందూరు సిటీ, న్యూస్‌టుడే: ఫిర్యాదుదారులకు సహాయకారిగా ఉండడం, అభిప్రాయాల సేకరణ వంటి అంశాల్లో ఉత్తమంగా వ్యవహరించిన నిజామాబాద్ ఒకటో ఠాణా కానిస్టేబుల్ ఎ.రజినీ హైదరాబాద్‌లో డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టంలో భాగంగా కానిస్టేబుల్ ఎ.రజిని జులై, ఆగస్టులో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆమెను సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ అభినందించారు.



ఏం చేస్తున్నట్లు?

- వానొస్తే నగరంలో కాలనీలు జలమయం
- డీ-54 కెనాల్ అన్యాక్రాంతం

న్యూస్‌టుడే: నిజామాబాద్ నగరం

ప్రకృతి ప్రకోపిస్తే ఏమవుతుందో ఇటీవల ఖమ్మం, విజయవాడలో సంభవించిన వరదలే నిదర్శనం. మానవ తప్పిదాలే ఈ పెను ప్రమాదాలకు కారణం. ప్రజలు ఎవరికి వారు మేల్కోవాల్సిన అవసరాన్ని విపత్తులు గుర్తుచేస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ మహానగరంలో చెరువుల్లో అక్రమ నిర్మాణాలపై 'హైడ్రా' అధికారులు బుల్డోజర్లతో కొరడా ఝులిపిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనూ కాల్వలు, చెరువులు అన్యాక్రాంతమయ్యాయి. ఇక్కడ మన అధికారులు చర్యలకు పూనుకోకుంటే రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవు.



గౌతంనగర్ డీ 54 కెనాల్ ముందుభాగం విశాలంగా ఉండి చివర కుచించుకుపోయిందిలా..



నటరాజ్ థియేటర్ పక్కన మురుగు కాల్వపై గోడ నిర్మించారిలా...



బోధన్ రోడ్డులో పరిస్థితి ఇదీ..

ఎక్కడికక్కడ పూడ్చివేత..

నిజాంసాగర్ ప్రధాన కాల్వ, స్థానిక చెరువుల నుంచి డీ-54 కెనాల్ ద్వారా 20 ఏళ్ల కిందటి వరకు పంట పొలాలకు నీరందేది. ఈ కాలంలో నగరం విస్తరించింది. పంట పొలాల్లో వెంచర్లు వేశారు. చూస్తుండగానే కాలనీలు వెలిశాయి. నగరపాలక సంస్థ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ఆక్రమణదారులు ఇళ్లు నిర్మించుకొని కాల్వ స్థలం కబ్జా చేసేశారు. వాస్తవానికి రెండు వైపులా కనీసం 30 ఫీట్ల ఖాళీ స్థలం ఉండాలి. కానీ, కొన్ని ప్రాంతాల్లో దానిపైనే నిర్మాణాలు చేపట్టారు. సాగునీటి వనరు కాస్త ప్రధాన మురుగు కాల్వగా మారిపోయింది. దీంతో ఒక మోస్తరు వర్షం కురిసినా వరద నీరు వెళ్లేందుకు దారిలేక రోడ్లపైకి చేరుతోంది. మురుగూ పారని పరిస్థితి. సుభాష్‌నగర్ ప్రాంతంలో ఏకంగా కాల్వను పూడ్చి వందల సంఖ్యలో భవనాలు నిర్మించారు. ఈ ప్రాంతంలో కాల్వ ఆనవాళ్లే కనిపించవు. ఫలితంగా గౌతంనగర్, చంద్రశేఖర్ కాలనీ, తారకరాం నగర్ లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. హైమద్‌పురా కాలనీ, ఆటోనగర్, ఖిల్లా రోడ్డు నుంచి బోధన్ రోడ్డు మార్గంలోని కాలనీల్లో ఒకప్పటి సాగునీటి కాల్వపై భవనాలు కట్టేశారు. కల్వర్టుల వద్ద విశాలంగా ఉండి ఆ తర్వాత కుచించుకుపోయింది. అర్సపల్లి శివారులో రామర్తి తటాకం సైతం ఆక్రమణకు గురవుతోంది. పులాంగ్ వాగునూ ఆక్రమణదారులు చెరబట్టారు. నిబంధనల ప్రకారం బఫర్ జోన్ 30 మీటర్లు ఉండాలి. ఎఫ్‌టీఎల్ నుంచి 9 మీటర్లు వదిలి పెట్టాల్సి ఉంటుంది.

ఆక్రమణల జాబితా సిద్ధం

ఆక్రమణలపై దృష్టి సారించాం. ఇటీవల తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ, పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాం. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులకు ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించాం. **- మకరందు, నగరపాలక సంస్థ కమిషనర్**

చెత్తకుండీలో బిడ్డను పారేసేందుకు యత్నం

ఐసీడీఎస్‌కు అప్పగింత

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే : మతిస్థిమితం లేని ఓ యువతి తన నవజాత శిశువును బుధవారం రాత్రి నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి చెత్తకుండీలో పారేసేందుకు చూడగా సిబ్బంది గమనించి వైద్యులకు అప్పగించారు. వారు చిన్నారికి వైద్య చికిత్స అందించారు. పాపకు స్వతంత్ర అని నామకరణం చేసి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ప్రతిమారాజ్ తెలిపారు.



శిశువుతో జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

విషజ్వరంతో యువతి మృతి

నిజామాబాద్ గ్రామీణం, డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విషజ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి (18) మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామీణ మండలం కేశాపూర్‌కు చెందిన ఆమె నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. డిచ్‌పల్లి మండలం రాంపూర్ వీరి సొంత గ్రామం కాగా తల్లిదండ్రులతో కలిసి కేశాపూర్‌లో నివాసముంటున్నారు. పది రోజుల క్రితం తాత అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలకు హాజరైంది. తర్వాత రోజు నుంచి యువతి తీవ్రజ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. డెంగీ పాజిటివ్ రావడంతో మరో దవాఖానాకు తరలించి చికిత్స అందించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోయి మృతి చెందారు. రాంపూర్‌లో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. పది రోజుల్లోనే తాత, మనవరాలు మృతిచెందడంతో కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పర్యావరణమే ఆరోగ్య భాగ్యం	సినిమా సెట్టు కాదు.. అంతర్రాష్ట్ర రహదారి	కొత్త పొదుపు సంఘాలు 6వ పేజీలో

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ కీలకం

న్యూస్‌టుడే, కోటగిరి

పంటలకు ఆశించిన చీడపీడలు, తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వర్షాలు, వాతావరణ మార్పులు, చీడపీడలు, తెగుళ్లు కర్షకులను కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతల సందేహాలు నివృత్తి చేసేందుకు బుధవారం కేవీకే శాస్త్రవేత్తలతో 'ఈనాడు' ఫోన్-ఇన్ నిర్వహించింది. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు డా.వెంకటరాజకుమార్, డా.శ్వేత, డా.విజయ్‌కుమార్ నివృత్తి చేశారు.

ఈనాడు ఫోన్-ఇన్‌లో రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్తలు



రైతుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు వెంకటరాజకుమార్, శ్వేత, విజయ్‌కుమార్

● **ప్రశ్న:** వరిలో మానిపండు/కాటుక తెగులు, కంకినల్లి నివారణ ఎలా? **- సాయిలు, కోటగిరి, రాజేందర్, డిచ్‌పల్లి**

■■ **సమాధానం :** మానిపండు తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ లేదా కార్బండాజిమ్ 50శాతం డబ్ల్యూపీ 1గ్రా లీటర్ నీటికి కలుపుకొని వెన్నులు పైకి వచ్చే దశలో ఓసారి, వారం తర్వాత మరోసారి పిచికారీ చేయాలి. కంకి నల్లి నివారణకు స్పైరోమెసిఫెన్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

● టమాటా లోపల రంధ్రాలు అవుతున్నాయి. ఆకులపై మచ్చలు ఏర్పడుతున్నాయి **- తారాచంద్, శంకోర, జహంగీర్, కందకుర్తి**

■■ సూది పురుగు నివారణకు ఎకరాకు 4-5 లింగాకర్షక ఎరలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు ఆశించిన కాయలు, పండ్లను కాల్చేయాలి. క్లోరాంత్రనిలిప్రోల్ 18.5 శాతం ఎస్.సి 0.2 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకు మాడు తెగులు నివారణకు మెటిరాం, పైరాక్లోస్ట్రోబిన్ 3గ్రా లీటరు నీటికి లేదా అజాక్సీస్ట్రోబిన్, డైఫెన్కొనజోల్ 1.మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ నివారణ, సెనగ రకాలు, విత్తు సమయం, ఎరువుల యాజమాన్యం వివరించగలరు? **- అర్జున్‌రావు, హెగ్డోలి**

■■ నివారణకు తెగులు 5శాతం కంటే ఎక్కువ సోకినపుడు నత్రజని వేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలి. 1-2 సార్లు పొలంలోని నీటిని పూర్తిగా బయటకు పంపాలి. అగ్రిమైసిన్ 0.4గ్రా లేదా ప్లాంటోమైసిన్ లేదా పోషమైసిన్ 0.2గ్రా లీటరు నీటిలో కలిపి 5-7 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయడంతో పాటు పొటాష్‌ను ఎకరాకు 10-15 కిలోలు వేసుకోవాలి. సుడిదోమ వ్యాపిస్తున్న పొలాన్ని ఆరబెడుతూ పాయలు తీయాలి. తొలి దశలో బ్యుప్రోఫెజిన్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్, ఇమిడాక్లోప్రిడ్ 1.5గ్రా లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద పిచికారీ చేయాలి. నల్లరేగడి నేలల్లో సెనగ సాగు చేయడానికి ఎన్.బి.ఈ.జి-3, జె.జి-11, ఎన్.బి.ఈ.జి-47 రకాలు అనుకూలం. నవంబర్ 15లోపు విత్తుకుంటే మంచి దిగుబడి వస్తుంది. 20కిలోల యూరియా, 100కిలోల ఎన్.ఎస్.పి, 15కిలోల ఎం.ఓ.పి, లేదా ఒక బస్తా డీఏపీ, 15 కిలోల ఎం.ఓ.పి వేసుకోవాలి.

● పసుపులో దుంపకుళ్లు, దుంప ఈగ, మర్రి ఆకు (తాటాకు మచ్చ) తెగులు నివారణ వివరించండి?
- నర్సయ్య, ప్రవీణ్, శెట్పల్లి(బి), సాగర్, మోర్తాడ్

■■ దుంపకుళ్లు నివారణకు లీటరు నీటికి 2.5గ్రా మెటలాక్సిల్, మాంకోజెబ్ లేదా 3గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి తెగులు సోకిన మొక్కల చుట్టూ మొదలు తడిసేలా పోయాలి. దుంప ఈగ లక్షణాలు గమనించిన వెంటనే ఎకరాకు 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. మచ్చలు ఉన్న, ఎండిన ఆకులు తొలగించి కాల్చేయాలి. లీటరు నీటికి 1మి.లీ ప్రొపికొనజోల్ లేదా 2గ్రా మాంకోజెబ్ కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

● వంకాయలో కొమ్మ కొనలు వడలిపోయి కాయలకు పుచ్చులు వస్తున్నాయి. **- శ్రీనివాస్, అఫందిఫారం**

■■ నివారణకు క్లోరాంత్ర నీలిప్రోల్ 18.5శాతం ఎస్.సి 0.2 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 5శాతం ఎస్.జి 0.4గ్రా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

● పత్తిలో గులాబీ పురుగు నివారణ తెలుపండి? **- సురేష్, కొప్పర్గ**

■■ ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు ఉద్ధృతి పరిశీలించి ప్రొఫినోఫాస్ 2మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


● కుసుమ రకాలు, విత్తు సమయం, విత్తన శుద్ధి ఎలా?
- కిషన్‌రావ్, సుంకిని

■■ మంజీర, పి.ఎన్.బి.ఎస్-12, టి.ఎస్.ఎఫ్-1 రకాలు నల్లరేగడి నేలల్లో నవంబర్ 15లోపు విత్తుకోవాలి. ఒక కిలో కుసుమ విత్తనానికి 3గ్రా కాప్టాన్ లేదా థైరమ్ లేదా కార్బండాజిమ్ 1గ్రా కలిపి విత్తనశుద్ధి చేయాలి.

దివ్యాంగులకు ఉపకరణాలు

జిల్లాలో 659 మంది అర్హుల గుర్తింపు

న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి (నిజామాబాద్)



జిల్లా సంక్షేమ శాఖ ఆగస్టు 27న ఆర్మూర్, 28న బోధన్, 29న నిజామాబాద్‌లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించింది. శారీరక వైకల్యం, బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగుల ధ్రువపత్రాలు, అర్హతలు పరిశీలించారు. మూడు డివిజన్లలో కలిపి 953 మంది హాజరుకాగా 659 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ జాబితా భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో)కు అందించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే ఈ సంస్థ రూ.1.50 కోట్లు వెచ్చించి ఉపకరణాలు సమకూరుస్తోంది. దివ్యాంగులకు బ్యాటరీతో పనిచేసే ట్రై సైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్‌ఛైర్లు, చేతి, చంక కర్రలు, బధిరులకు శ్రవణ యంత్రాలు, అంధులకు చేతి కర్రలు, మానసిక దివ్యాంగులకు అవసరమైన ప్రత్యేక కిట్లు అందించనుంది. అలింకో సంస్థ సహకారంతో ఏటా దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందజేస్తున్నామని, డిసెంబరులో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బీ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

పనితీరు మెరుగుపర్చేందుకే పరీక్షలు

నిజామాబాద్ నేరవిభాగం : పోలీసు శాఖలో సిబ్బంది పనితీరు మెరుగుపర్చేందుకే పలు అంశాల్లో పరీక్షలు నిర్వహించామని సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు డ్యూటీ మీట్ కార్యక్రమంలో భాగంగా సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి బుధవారం ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రక్రియతో ఏసీపీ నుంచి కానిస్టేబుల్ వరకు పని తీరు మెరుగు పడుతుందన్నారు. విచారణ స్థాయిలు, పోటీతత్వం, శాస్త్రీయం, పరిశోధన, ఫోరెన్సిక్ సైన్స్‌లో లిఫ్టింగ్, ప్యాకింగ్, ఐవో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, నేరస్థలంలో సేకరించాల్సిన సమాచారం తదితర అంశాలపై పరీక్ష నిర్వహించామన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి

సమాజంలో గౌరవంగా బతికేందుకు జాబ్‌కార్డు ● ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

ఏళ్లుగా ట్రాన్స్‌జెండర్లు వివక్షకు గురవుతున్నారు. పనికి వెళ్దామంటే ఎవరూ పిలవని పరిస్థితి. ఊరిని, కన్నవారిని వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. పట్టణాలు, నగరాల్లో భిక్షాటన చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వారు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఉన్న ఊళ్లోనే ఉపాధి పొందేందుకు జాబ్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో 62 మందికి లబ్ధి

ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 62 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా ఆర్మూరు- 6, బోధన్ - 4, బాన్సువాడ - 13, నిజామాబాద్ గ్రామీణం- 6, బాల్కొండ - 2, జుక్కల్ - 9, ఎల్లారెడ్డి - 2, కామారెడ్డి 20 మంది ఉన్నారు. జాబితాలో పేర్లు లేని వారు సైతం ఉన్నారు. 18 ఏళ్లు నిండిన వారికీ జాబ్ కార్డు ఇవ్వనున్నారు.

వివక్ష చూపకుండా అవగాహన కల్పిస్తాం

- సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

పల్లెల్లో ఎంత మంది ఉన్నారనేది గుర్తిస్తాం. అడిగిన వారందరికీ జాబ్ కార్డు ఇస్తాం. పని ప్రదేశంలో కావాల్సిన వసతులు ఉంటాయి. వారిపై వివక్ష చూపకుండా మిగతా కూలీలకు అవగాహన కల్పిస్తాం.

మార్గదర్శకాలు ఇలా...


- ఆధార్ ఆధారంగా జాబ్ కార్డు ఇవ్వాలి.
- ఒక గ్రామంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే గ్రూపు ఏర్పాటు చేయాలి. లేదంటే వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించాలి.
- పని ప్రదేశంలో వారిపై వివక్ష చూపొద్దు.
- వారి సమస్యల పరిష్కారానికి మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని నియమించాలి.



తీరు మారదు.. అక్రమం ఆగదు

లోపభూయిష్ఠంగా కస్టమ్ మిల్లింగ్

ఈనాడు, నిజామాబాద్



జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ లోపభూయిష్ఠంగా మారింది. ప్రభుత్వ ధాన్యంతో మిల్లర్లు వ్యాపారం చేస్తున్నారు. అధికారులు అనుసరిస్తున్న వైఖరే ఇందుకు కారణం. మిల్లుల్లో నిల్వ ధాన్యం దుర్వినియోగంపై వీరు వ్యవహరిస్తున్న తీరు ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జిల్లా అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌లపై ఏకకాలంలో వేటు పడింది. ఇదంతా గడిచిన రెండేళ్లలో సంబంధిత శాఖలో చోటుచేసుకున్న పరిణామాలపై తీసుకున్న కఠిన నిర్ణయంగా చెప్పుకొచ్చారు. కానీ, తర్వాత జరిపిన తనిఖీల్లోనూ పెద్దమొత్తంలో ధాన్యం పక్కదారి పట్టిన ఉదంతాలు బయటపడటం ఆశ్చర్యానికి గురిచేసింది.

అధికారుల విచిత్రమైన తీరు..

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం జులైలో జరిపిన తనిఖీల్లో 11 మిల్లుల్లో ఉండాల్సిన దానికంటే తక్కువ ధాన్యం నిల్వలున్నాయి. ఆ విషయాలు అప్పట్లో గోప్యంగా ఉంచారు. 'ఈనాడు' వివరాలు వెలుగులోకి తీసుకురాగా.. మాయమైన ధాన్యం విలువకు అదనంగా 25 శాతం జరిమానా విధిస్తున్నట్లు చెప్పి.. నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. తర్వాత సంబంధిత శాఖ తీసుకున్న చర్యల్లో పురోగతి ఏంటో బయటకు తెలియనివ్వలేదు. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఈ నెల 23న 'మిల్లర్ల అక్రమాలపై గప్‌చుప్' శీర్షికన కథనం ఇచ్చింది. దీనిపై స్పందించిన ఆ శాఖ జిల్లా అధికారులు మళ్లీ నాడు జారీ చేసిన నోటీసుల విషయాన్నే చెబుతున్నారు. 11 మిల్లుల్లో మాయమైన ధాన్యం విలువ ఎంత? అందులో బాధ్యులైన మిల్లర్లు ఎంత తిరిగి చెల్లించారనే విషయాలు మాత్రం హైదరాబాద్ కార్యాలయంలో ఉంటాయని పేర్కొంటున్నారు. గోప్యతను వీడి పారదర్శకత పాటించినప్పుడే అక్రమాలకు పాల్పడేవారు భయపడతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సామర్థ్యానికి మించి కేటాయింపులు

కస్టమ్ మిల్లింగ్‌లో ఇంత భారీగా అక్రమాలు జరగటానికి అధికారుల లీలలే కారణం. మిల్లు సామర్థ్యం మేరకు ప్రతి సీజన్‌లో ధాన్యం కేటాయింపులు చేయాలి. కానీ, పైరవీలు, లోపాయికారి ఒప్పందాలు చేసుకొని ఇష్టారాజ్యం చేశారు. 3 వేల టన్నులకు పరిమితమవ్వాల్సిన చోట ఏడు, ఎనిమిది రెట్లు కేటాయించినట్లు విచారణలో వెలుగుచూసింది. ఒకే మిల్లు యాజమాన్యం రూ.50 కోట్ల ధాన్యం దుర్వినియోగానికి పాల్పడటమే ఇందుకు నిదర్శనం. రికవరీ నోటీసులు ఇచ్చి ఠాణాలో కేసు పెట్టి తమ పనైపోయిందని అధికారులు చేతులెత్తేశారు. ఇలా ఏటా రూ.కోట్ల విలువైన ధాన్యం కొందరు తమ సొంతానికి వాడేసుకుంటున్నా.. కట్టడి చేయలేని పరిస్థితి ఎందుకొచ్చిందో ఆలోచించాలి.

సినిమా సెట్టు కాదు.. అంతర్రాష్ట్ర రహదారి



చీల్చిన కొండ.. మధ్యలోంచి రహదారి.. గుహను తలపించే మలుపు తిరిగిన దారి.. చూస్తుంటే.. ఇదేదో సినిమా సెట్టింగ్ అనుకుంటున్నారేమో.. అలా అనుకుంటే పొరబడినట్లే.. ఇది తెలంగాణ - కర్ణాటక రాష్ట్రాలను కలిపే రహదారి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రం నుంచి దోస్త్‌పల్లి, డోన్‌గావ్, సోపూర్ మీదుగా కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలో పలు ప్రాంతాలను కలుపుతుంది. జుక్కల్ మండల ప్రజలకు బీదర్ జిల్లా వాసులతో బంధుత్వాలున్నాయి. తరచూ రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గతంలో ఈ రోడ్డు ఒకే వరుస ఉండేది. దీనిని రెండు వరుసలుగా విస్తరించేందుకు నిధులు మంజూరు కావడంతో పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దోస్త్‌పల్లి- డోన్‌గావ్ మధ్యలో గుట్ట పైకి వాహనాలు సులువుగా ఎక్కేందుకు వీలుగా కొండను తొలచి నిర్మాణం చేపడుతున్నారు. సుమారు 100 మీటర్ల మేర ఎత్తైన గుట్టపై వేస్తున్న గుహలాంటి రోడ్డు ఆకట్టుకుంటోంది. నిర్మాణం పూర్తయితే కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు రాకపోకలు సులువవుతాయి.

– ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, జుక్కల్

పర్యావరణమే ఆరోగ్య భాగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం... ఇది నిన్నటి మాట. పర్యావరణమే ఆరోగ్య భాగ్యం... ఇది నేటి మాట. ప్రస్తుతం ఎవరిని పలకరించినా...ఏదో ఒక అనారోగ్య సమస్యను ప్రస్తావిస్తున్నారు. వాటిలో సింహభాగం వాతావరణ అనుబంధమైనవి ఉంటున్నాయి. ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధుల్లో ఎక్కువగా దెబ్బతిన్న పర్యావరణంతో వచ్చినవి ఉండటం గమనార్హం. ప్రకృతి మనకిచ్చే గాలి, నీరు కలుషితమైతే మానవ మనుగడ ప్రమాదంలో పడుతుంది. ఇప్పటికే ఎదుర్కొంటున్న వ్యాధుల నుంచి కనువిప్పు పొంది ప్రకృతిని కాపాడకుంటే కంకణం కట్టుకోవాల్సిన తరుణమిది. ఈ నేపథ్యంలోనే ఏటా సెప్టెంబరు 26న పర్యావరణ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మనిషి పర్యావరణానికి చేటు చేస్తున్న ప్రధాన అంశాలను ఒకసారి సమీక్షించుకుని నియంత్రణపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

పెట్రోలు, డీజిల్: ద్విచక్ర వాహనాలు, కార్లు.. ఇలా సొంత రవాణా సదుపాయాలు పెరగడంతో పెట్రోలు, డీజిల్ వినియోగం రెట్టింపైంది. దేశంలో తలసరి వార్షిక వినియోగం పెట్రోలు 26.78 లీటర్లు, డీజిల్ 74.54లీటర్లు. ఒక లీటరు పెట్రోలు కాలిస్తే 2.38కిలోల కార్బన్‌డైఆక్సైడ్ గాలిలో కలుస్తుంది. అది డీజిల్‌లో 2.54 కిలోలు ఉంది. వినియోగంలో ఒక లీటరు తగ్గించినా దాదాపు మూడు కిలోల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి.



విద్యుత్తు: రాష్ట్ర తలసరి వార్షిక విద్యుత్తు వినియోగం 2126 యూనిట్లు. అంటే రోజుకు 5.82 యూనిట్లు వినియోగిస్తున్నట్లు. ఒక యూనిట్ విద్యుత్తు కోసం పర్యావరణంలోకి 0.85- 1.1 కిలోల కార్బన్‌డైఆక్సైడ్ విడుదల చేయాల్సి వస్తుంది. ఒక వ్యక్తి ఉపయోగించే రోజువారీ విద్యుత్తుతో ఆరు కిలోల కార్బన్‌డైఆక్సైడ్ విడుదలవుతోంది. పొదుపుతో ఒక యూనిట్ తగ్గించినా పర్యావరణానికి మేలు.



ఆహారం: మనిషి బతకడానికి తీసుకునే ఆహారాన్ని వృథా చేస్తే పర్యావరణానికి ముప్పు. ఏటా ఒక మనిషి 55కిలోల ఆహారం వృథా చేస్తున్నట్లు లెక్కగట్టారు. ఒక కిలో ఆహారోత్పత్తికి పర్యావరణంలోకి 2.5కిలోల కార్బన్‌డైఆక్సైడ్ చేరుతుంది.



ప్లాస్టిక్: రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ భాగమై శరీరంలోకి చొచ్చుకెళ్లిందని నిపుణులు చెబుతున్నారు. అంతలా పెనవేసుకున్న ప్లాస్టిక్ వార్షిక తలసరి వినియోగం 8కిలోలు. ఒక కిలో ప్లాస్టిక్ కాల్చితే 2.9కిలోల కార్బన్‌డైఆక్సైడ్ వెలువడుతుంది. అలాగే కిలో మొత్తంలో ప్లాస్టిక్ వినియోగిస్తే ఆరు కిలోల కార్బన్‌డైఆక్సైడ్ ఉత్పత్తవుతుంది.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు: స్మార్ట్‌ఫోన్, టీవీలు.. ఇలా మనిషి రోజువారీ అవసరాలు తీర్చే వాటిలో ఎలక్ట్రానిక్ వస్తువులు అంతర్భాగమయ్యాయి. ఏటా ఒక వ్యక్తి 2.4కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఉత్పత్తి చేస్తున్నట్లు లెక్కగట్టారు. ఈ వ్యర్థాలతోనూ పర్యావరణంలోకి విష వాయువులు చేరుతున్నాయి.

మొక్కలు: ఏటా నివాస గృహాల్లో లక్షలాది మొక్కలు నేలవాలుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సగటున వంద ఎకరాలకుపైనా వ్యవసాయ భూములు కాంక్రీటు వనాలుగా మారుతున్నాయి. ఇళ్లు కట్టడానికి ఉన్న మొక్కలు నరికేయడం, గృహోపకరణాలకు వాడే కలప కోసం విలువైన వృక్షాలు అంతరించిపోతున్నాయి.



జనాభా

కామారెడ్డి : 9,72,625

నిజామాబాద్ : 15,71,022


జిల్లాపై ప్రభావం ఇలా..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 28లక్షల జనాభా ఉంది. వివిధ అంశాల్లో జాతీయ సగటు లెక్కగడితే.. పర్యావరణంలో జిల్లా ప్రజల కాలుష్య పాత్ర తెలుస్తుంది. ఉదాహరణకు విద్యుత్తు తీసుకుంటే.. రాష్ట్ర తలసరి విద్యుత్తు వినియోగం 2126 యూనిట్లు. 28లక్షల జనాభాకు లెక్కిస్తే వందల కోట్ల యూనిట్లకు చేరుతుంది. ఒక వ్యక్తి రోజుకో యూనిట్ వినియోగం తగ్గిస్తే.. ఏడాదిలో 365 యూనిట్లు ఆదా అవుతుంది. ఫలితంగా దాదాపు 700 కిలోల కార్బన్‌డైఆక్సైడ్‌ను గాలిలో కలవకుండా నిరోధించిన వారమవుతాం. ఇలా అన్ని విభాగాల్లోనూ లెక్కేసుకుంటే ఎంత నష్టం కలిగించి.. మన ఆరోగ్యాన్ని ఎంత నష్టపరచుకుంటున్నామన్నది తెలుస్తుంది.



ఉమ్మడి జిల్లాలో వాహనాలు దాదాపు 5 లక్షలు

అన్ని రకాల విద్యుత్తు కనెక్షన్లు
కామారెడ్డి : 4.22 లక్షలు
నిజామాబాద్ : 7.50 లక్షలు



మనసున్న మాస్టారు

సాయం చిన్నదే అయినా.. కొన్నిసార్లు గొప్ప స్ఫూర్తి నింపుతుంది. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం సుంకెట ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పెద్ది సంతోష్‌కుమార్ అలాంటి సాయమే చేశారు. తన బడిలో ఏడో తరగతి విద్యార్థిని బేల్దారి ధనలక్ష్మి నిత్యం 2 కి.మీ. నడిచి వస్తోంది. చదువులో చురుకు. తల్లిదండ్రులు దినసరి కూలీలు. ముగ్గురు ఆడపిల్లలు. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఆయన పాఠశాలకు వచ్చి ఏడాది పూర్తికావడంతో బుధవారం రూ.5 వేలు వెచ్చించి బాలికకు సైకిల్ కొనిచ్చారు. ఆయన స్థానికంగానే అద్దెకుంటూ ఉదయం, సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులకు సాయంత్రం 6 నుంచి 8 వరకు నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్‌షిప్ పరీక్షకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే తన కుటుంబ సభ్యుల సహకారంతో 100 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు, బూట్లు, టై, బెల్టులు, గుర్తింపు కార్డులు సమకూర్చారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం పచ్చునూరులో పనిచేసినప్పుడు సైతం 14 మంది విద్యార్థులకు సైకిళ్లు సమకూర్చారు.

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం



సంతోష్‌కుమార్



తండ్రి సమక్షంలో విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌కుమార్

విదేశీ విద్యపై అవగాహన

నిజామాబాద్ విద్యా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో టీఎస్‌కేసీ, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఐఏఈసీ కన్సల్టెన్సీ ప్రతినిధులు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు విదేశీ విద్యపై బుధవారం అవగాహన కల్పించినట్లు వైస్ ప్రిన్సిపల్ అబ్దుర్ రఫీక్ తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, చదువుతూ పనిచేసే అవకాశాలను వివరించారు. కన్సల్టెన్సీ ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త రామకృష్ణ, వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ రఫీక్

28న అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా నాగారంలోని రాజారాం స్టేడియంలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 16, 18, 20 బాల బాలికల విభాగాల్లో ఎంపికలుంటాయని పేర్కొన్నారు. ఎంపికైన వారు వచ్చేనెల 7, 8 తేదీల్లో హన్మకొండలో జరిగే జూనియర్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. దరఖాస్తులు ఈ నెల 27 సాయంత్రం 5 గంటలలోపు చేసుకోవాలని, వివరాలకు చరవాణి నంబర్ 99890 40776లో సంప్రదించాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్(మంచిప్ప)లో ఈనెల 28న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల క్రీడాకారులకు రెజ్లింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి ప్రకటనలో తెలిపారు.

దీన్‌దయాళ్ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: సమాజహితం కోసం పాటుపడిన వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి పేర్కొన్నారు. మారుతి నగర్‌లోని స్నేహసొసైటీలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించి చిత్రపటానికి నివాళులర్పించారు. దివ్యాంగ విద్యార్థులకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అంధ విద్యార్థులు ఆలపించిన పాటలు అలరించాయి. స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, శ్యామ్‌సుందర్ లడ్డా, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే ఉత్తమ ఫలితాలు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: అధ్యాపకులు బోధించే విద్య విజ్ఞానాన్ని పెంచేందుకు దోహదపడాలని తెవివి రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అన్నారు. జాతీయ విద్యా విధానం-2020పై వర్సిటీలో బుధవారం అకడమిక్ ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో విద్యార్థులతో పాటు అధ్యాపకుల భాగస్వామ్యం ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణాధికారి అరుణ, వర్సిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ సాయిలు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఆరతి, అధ్యాపకులు శంకర్, ఆంజనేయులు, సంపత్, రాంబాబు, రవీందర్‌రెడ్డి, నందిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి

అధ్యాపకులు పరిజ్ఞానం పెంచుకోవాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: అకౌంట్స్‌లో మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు పరిజ్ఞానం పెంచుకోవాలని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. వర్సిటీలోని కామర్స్ విభాగంలో 'క్లిక్-టెర్న్-టీచ్ టాలీ ప్రైమ్' అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన కార్యశాలకు రిజిస్ట్రార్ హాజరయ్యారు. అకౌంట్స్ నిర్వహణ, నివేదికల రూపకల్పన, టాలీ ప్రాముఖ్యంపై శిక్షకుడు జగదీశ్వర్ ప్రసంగించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఆరతి, డైరెక్టర్ ఆచార్య గోపిశెట్టి రాంబాబు, కార్యశాల కన్వీనర్లు శ్రీనివాస్, శ్వేత, అధ్యాపకులు గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి


తెవివి క్యాంపస్: హైకోర్టు ఉత్తర్వులు, అడ్వొకేట్ జనరల్ న్యాయ సలహా మేరకు షరతులతో కూడిన పదోన్నతులను అమలు చేయాలంటూ తెవివిలో 2014 ఏడాదిలో నియామకం పొందిన అధ్యాపకులు డిమాండ్ చేశారు. బుధవారం రిజిస్ట్రార్ యాదగిరికి టూటా ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు టూటా అధ్యక్షుడు పున్నయ్య అధ్యక్షతన తొలుత సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి మోహన్ బాబు, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాజేశ్వరి, కార్యదర్శులు బాలకిషన్, నీలిమా, సభ్యులు పాల్గొన్నారు.

కొత్త పొదుపు సంఘాలు

● జిల్లాలో 10 వేల మందికి అవకాశం

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబానికి అండగా నిలుస్తారు. జిల్లాలో ప్రస్తుతం సహాయక సంఘాలు పొదుపు బాట పట్టి ఆదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, నగరం, పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో సంఘాలు బలోపేతానికి అడుగులు వేస్తున్నాయి. తాజాగా కొత్తగా సభ్యులను చేర్చుకునేందుకు కసరత్తు నడుస్తోంది. ఇందులో సభ్యులుగా చేరిన వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రేషన్ కార్డుల జారీ, చీరల పంపిణీ ఇతర సంక్షేమ పథకాలు కావాలంటే కచ్చితంగా మహిళా సంఘం సభ్యులై ఉండాలి. ఈ దిశగా గ్రామాలు, మున్సిపాలిటీల్లో సిబ్బంది కొత్తగా సభ్యుల చేరికపై కసరత్తు చేస్తున్నారు. కొత్తగా 10 వేల మందికి పైగా అవకాశం దక్కనుంది.





గ్రామీణ ప్రాంతాల్లో

డీఆర్‌డీఏ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు గ్రూపుల్లో సభ్యులుగా లేని వారిని గుర్తించి చేర్పిస్తున్నారు. పొదుపు చేస్తే కలిగే లాభాలు, బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు వస్తాయని, వాటి ద్వారా లాభపడిన సంఘాల గురించి వివరిస్తున్నారు. గ్రామాల్లో 8,510 మంది సభ్యులను చేర్చుకోవాలనే లక్ష్యం ఉండగా ఇప్పటికే 6,510 మందిని చేర్పించారు. త్వరలోనే లక్ష్యం సాధిస్తామని డీఆర్‌డీవో సాయాగౌడ్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో..

నిజామాబాద్ నగరంతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో కొత్త సభ్యులను చేర్చుకుంటున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఇప్పటి వరకు ఏ సంఘంలో లేని వారిని చేర్చుకోవాలని ఆదేశాలు వచ్చాయి. నగరంతో పాటు మూడు పురపాలికల్లో 12 గ్రూపులు తయారు చేయగా 600 మందిని చేర్పించినట్లు మెప్మా పీడీ రాజేందర్ తెలిపారు. అక్టోబర్ 15 వరకు గడువు ఉన్నందునా మరింత మంది పెరిగేలా చూస్తామన్నారు.

ఆర్టీసీ డిపోల తనిఖీ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో1, డిపో2 లను ఈడీ(ఆపరేషన్స్, హైదరాబాద్) మునిశేఖర్ బుధవారం తనిఖీ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాలకు చేస్తున్న ఆరోగ్య శిబిరాలను పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో డిపోలవారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదాయం పెంచడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆర్ఎం జానిరెడ్డి తదితరులు ఉన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఈడీ మునిశేఖర్

ప్రేమను తిరస్కరించిందని.. యువకుడి ఆత్మహత్య

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతి తిరస్కరించిందని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మనోజ్‌కుమార్, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని సిర్నాపల్లికి చెందిన హోన్నాజీపేట్ అజయ్(21) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో పరిచయమైన ఓ యువతిని ప్రేమించగా తిరస్కరించింది. తీవ్ర మనస్తాపానికి గురైన అజయ్ ఈ నెల 10వ తేదీన ఇంట్లో పురుగులమందు తాగుతూ వీడియో తీసి యువతికి పంపించాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పలేదు. తరచూ వాంతులు చేసుకోవడంతో వారు చికిత్స నిమిత్తం 13న మండల కేంద్రంలోని దవాఖానాకు, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. 14వ తేదీన అజయ్ చరవాణిని అతడి సోదరి చూడగా పురుగుల మందు తాగుతూ యువతికి పంపిన వీడియో చాటింగ్‌లో కనిపించింది. చికిత్స పొందుతూ అజయ్ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు బుధవారం స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు.



అజయ్

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: హత్యకేసులో నిజామాబాద్ గ్రామీణ మండలం ఖానాపూర్‌కు చెందిన బోనిశెట్టి గంగమల్లుకు యావజ్జీవ శిక్షతో పాటు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కుంచాల సునీత బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలిలా.. రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ కొక్కండ రాంప్రసాద్ ఖానాపూర్‌లో స్థిరపడ్డారు. తన ఇంటి పక్కన ఉండే బోనిశెట్టి గంగమల్లు 2022 ఫిబ్రవరి 19న రోడ్డు విషయంలో గొడవపడ్డాడు. దీంతో రాంప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంగమల్లు ఇది మనసులో పెట్టుకుని అదే నెల 25న ఆయన తలపై కర్రతో బాదడంతో అక్కడికక్కడే చనిపోయాడు. రాంప్రసాద్ కుమారుడు కార్తీక్ నిజామాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసుల తరపున జిల్లా కోర్టు పీపీ రవిరాజ్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జిల్లా జడ్జి నిందితుడికి శిక్ష విధించారు.

దూషించి, దాడి చేసినందుకు మూడేళ్ల జైలు

నిజామాబాద్ న్యాయ విభాగం : ఇంట్లోకి చొరబడి కులం పేరుతో దూషించి దాడి చేసిన కేసులో నిజామాబాద్ ఖిల్లా రోడ్డుకు చెందిన కొట్టోల కార్తీక్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి టి.శ్రీనివాస్ బుధవారం తీర్పునిచ్చారు. వివరాలిలా... 2023 ఆగస్టు 3 న రూ.3 వేల విషయంలో జిల్లా కేంద్రం గాజుల్‌పేట్‌కు చెందిన ఇందిరాబాయి కుమారుడు, నిందితుడు కార్తీక్ మధ్య గొడవ జరిగింది. అదే రోజు కార్తీక్ ఇందిరాబాయి ఇంటికెళ్లి 'నీ కుమారుడు నాకు డబ్బులు ఇచ్చేది ఉందని' పేర్కొంటూ కులం పేరుతో దూషించి ఇంట్లో వస్తువులు పగలగొట్టి కర్రతో ఆమెను కొట్టాడు. దీంతో బాధితురాలు నిజామాబాద్ రెండో టౌన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసుల తరపున అదనపు కోర్టు పీపీ బంటు వసంత్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి శిక్ష విధించారు.

పోక్సో కేసు నమోదు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ నగరంలోని మూడో ఠాణా పరిధిలో ఓ బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని ఓ బాలికను యువకుడు సునీల్ కొంతకాలంగా వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తెను ఇబ్బంది పెట్టొద్దని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ కుమార్ తెలిపారు.

నిధుల మంజూరుకు వినతి

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మ్యాక్స్ భవనం అదనపు గదుల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని సంఘం ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం ప్రతినిధులు సన్మానించారు. చిన్న గంగు, పుప్పాల లక్ష్మి, నీరడి ఎల్లవ్వ, వనిత, సాయమ్మ, సమీరా, మాజీ సర్పంచి నర్సారెడ్డి, వినోద్ తదితరులున్నారు.



నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

ప్రత్యేక ఆటస్థలం ఏర్పాటు చేస్తాం

నిజామాబాద్ వైద్యవిభాగం : వైద్య విద్యార్థులకు ప్రత్యేక ఆటస్థలం, జిమ్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హామీనిచ్చారు. బుధవారం 'ఎలిగ్జర్ ఫెస్ట్' వైద్య కళాశాల వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు అవసరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ప్రిన్సిపల్ డా. శివప్రసాద్, తిరుపతిరావు, నాగమోహన్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: దుబ్బాక జడ్పీహెచ్ఎస్ ఎదుట చిన్న వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలుస్తోంది. విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- మహేష్, దుబ్బాక**

సమాధానం: ఉపాధ్యాయులు మా దృష్టికి తీసుకొచ్చారు.. వర్షం నీరు నిలవకుండా గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరిస్తాం. **- సాయికుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, దుబ్బాక**

సమస్య: జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో రహదారి పక్కన భగీరథ వాల్వు గుంతపై పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహన చోదకులు గుంతను గమనించక అందులో పడి గాయపడ్డారు. **- గంగారెడ్డి, స్థానికుడు, మునిపల్లి**

సమాధానం: గుంతపై కప్పును అమర్చి, శాశ్వత పరిష్కారం చూపుతాం. **- అన్వేష్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ, జక్రాన్‌పల్లి**

సమస్య : బోధన్ చెక్కిక్యాంపులోని డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయాయి.

- శంకర్, చెక్కిక్యాంపు



పరిష్కారం : ఈ సమస్యను శానిటరీ జవాన్ గాబ్రియెల్ దృష్టికి తీసుకెళ్లగా డ్రైనేజీలో వ్యర్థాలు తొలగించారు.

సమస్య: సిద్ధాపూర్ ఎస్సీకాలనీలోని మురుగుకాల్వల్లో పేరుకున్న వ్యర్థాలు తొలగించాలి? **- దిగంబర్, కాలనీవాసి**

సమాధానం: పరిశీలించి కాలనీలో పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటాం

- ప్రణవ్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: న్యాల్‌కల్ రోడ్డు వివేకానందనగర్ కాలనీలో చెత్త సేకరణ రిక్షా రావడం లేదు. దీంతో ఖాళీ ప్రదేశంలో చెత్త పారబోయాల్సి వస్తోంది? **- శివ, వివేకానందనగర్**

సమాధానం: చెత్త సేకరణ రిక్షా రోజు వచ్చేలా చూస్తా. **- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, జోన్-2**

సమస్య : సిరికొండ బైపాస్‌రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.**- సంతోష్, సిరికొండ**

సమాధానం: త్వరలో రోడ్డు సమస్యకు పరిష్కారం చూపుతాం. **- పంచాయతీరాజ్ శాఖ డీఈ హైమద్‌హుస్సేన్**

సమస్య: సాయినగర్ రోడ్ నంబర్3లోని రోడ్ల పక్కన డ్రైనేజీలు నిర్మించలేదు.

- రాము, సాయినగర్

పరిష్కారం: నిధులు లేక డ్రైనేజీలు నిర్మించలేదు. దోమలు పెరగకుండా మందు పిచికారీ చేయిస్తాం

సమస్య: దుబ్బరోడ్డులోని చికెన్ సెంటర్ వద్ద వ్యర్థాలు, గ్లాసులు పడేస్తున్నారు.

- రాజు, దుబ్బ

సమాధానం: చికెన్ వ్యర్థాలు పారేస్తే జరిమానా విధిస్తాం.

- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

న్యూస్‌టుడే, బోధన్, బోధన్ గ్రామీణం, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ అర్బన్, సిరికొండ, నిజామాబాద్ నగరం



అభ్యర్థుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

యోగా కేంద్రాలకు శిక్షకుల ఎంపిక

నిజామాబాద్ వైద్యవిభాగం : ఆయుష్ యోగా కేంద్రాలకు మాస్టర్లను ఎంపిక చేసే ప్రక్రియ బుధవారం చేపట్టారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏడో అంతస్తులో ముఖాముఖి నిర్వహించారు. తెలంగాణ ఆయుష్ శాఖ అదనపు సంచాలకుడు డా. లింగరాజు, ఆయుష్ శాఖ వరంగల్ ఆర్‌డీడీ ప్రమీలాదేవి నియామకాలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని 32 యోగా కేంద్రాలకు సంబంధించి 450 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. ఆయుష్ విభాగం ఇన్‌ఛార్జి నారాయణరావు తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం

మంజీర నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల నుంచి అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. పగలు నది నుంచి ఇసుక తరలించి శివారులో నిల్వలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అనంతరం రాత్రి వేళల్లో అనుమతి లేకుండా టిప్పర్ల ద్వారా ఇసుకను రవాణా చేస్తున్నారు. బోధన్ మండలం ఖండ్‌గాం, సిద్ధాపూర్, కొప్పర్గ, హంగర్గ, హున్సా, మందర్న తదితర గ్రామాల్లో ఎటు చూసినా ఇసుక నిల్వలే దర్శనమిస్తుంటాయి. నది ఒడ్డు నుంచి అక్రమార్కులు ఎడ్లబండ్ల బాటల్లో ఏర్పడిన గుంతలు పూడ్చుకుంటూ దారి బాగు చేసుకొని ఇసుకను తీసుకొస్తున్నారు. తర్వాత ప్రజల ఇళ్ల మధ్య నిల్వ చేస్తున్నారు. ఒక పక్క అనుమతి లేకుండా ఇసుక తరలించవద్దని అధికారులు చెబుతున్న మాటలను ఇసుక మాఫియా వినిపించుకోక యథేచ్ఛగా రవాణా సాగిస్తున్నారు. టిప్పర్లలో పరిమితికి మించి ఇసుక తరలిస్తుండటంతో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన బీటీరహదారులకు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు ఇసుక రవాణాను అడ్డుకోవాలని స్థానిక గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ విఠల్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను జప్తు చేస్తామని తెలిపారు.



సిద్ధాపూర్‌లో నిల్వలు..



బోను ఏర్పాటు చేసిన అధికారులు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: సారంగపూర్‌లోని జిల్లా కేంద్ర కారాగారం ప్రాంతంలో ఎలుగు బంటి సంచరిస్తుందని జైలు అధికారులు అటవీ శాఖకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఆ ప్రాంతంలో బుధవారం ఎలుగు బంటిని పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేశారు. జూపార్కు నుంచి ప్రత్యేకంగా రెస్క్యూ బృందం రంగంలోకి దిగింది. నిజామాబాద్ ఎఫ్‌డీవో సుధాకర్‌రావు, నార్త్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్, సెక్షన్ అధికారులు ప్రతాప్, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అభినందన


నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ రూరల్ ఠాణా పరిధిలో సిగ్నల్ జంప్ చేసి వెళ్తున్న ఓ కారును అక్కడున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ అబ్బులు ఆపి తనిఖీ చేశారు. వాహనంలో కత్తులు ఉండటాన్ని గమనించాడు. అందులోని వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు. సమయస్ఫూర్తి, చాకచక్యంతో వ్యవహరించిన కానిస్టేబుల్‌ను సీపీ కల్మేశ్వర్ అభినందించారు. అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ పాల్గొన్నారు.



కానిస్టేబుల్ అబ్బులును సత్కరిస్తున్న సీపీ కల్మేశ్వర్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

అవగాహన

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ శిక్షణ శిబిరం(సీఏటీసీ)లో లెఫ్టినెంట్ కర్నల్ క్యాంపు కమాండెంట్ విష్ణు ప్రసాద్ నాయర్ ఆధ్వర్యంలో కేడెట్లకు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులను శిక్షిస్తారని ట్రాఫిక్ కానిస్టేబుల్ శివప్రసాద్ వివరించారు. 12వ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడని ఇందూరు గాయకులు పేర్కొన్నారు. స్వర సౌరభం ఆధ్వర్యంలో నగరంలోని వినాయక్‌నగర్ సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన వర్ధంతి నిర్వహించారు. చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యక్షుడు నాగరాజశర్మ, చందన్ రావు, అశోక్‌శర్మ, వీరమ్మ, సుజాత, రాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కార్యశాలకు డీఈవో

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎన్సీఈఆర్టీ పుదుచ్చేరిలో నిర్వహిస్తున్న జాతీయ విద్యాపరిశోధన కార్యశాలకు డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం హాజరయ్యారు. బడిబయటి పిల్లల నమోదు, నైపుణ్యాలతో కూడిన విద్యార్థులు తయారయ్యేలా ప్రణాళికలు రూపొందించడం వంటి అంశాలపై మూడురోజుల పాటు కార్యశాల ఉండనుందని ఆయన వెల్లడించారు.

అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాలు

ఖలీల్‌వాడి : అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాలు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో బుధవారం వారోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. భూమన్న, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ

పోచారాన్ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

రుద్రూర్, న్యూస్‌టుడే: మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని బాన్సువాడలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాలతో సత్కరించారు. వర్ని మార్కెట్ కమిటీలో రుద్రూర్ మండలానికి చెందిన ముగ్గురిని ఏఎంసీ డైరెక్టర్లుగా నియమించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అరుణ్, ఉపాధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రేషన్ డీలర్ల నియామకానికి రాత పరీక్ష

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే : బోధన్ డివిజన్ పరిధిలో రేషన్ డీలర్ల ఎంపికకు 29న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 80 రేషన్ దుకాణాల ఖాళీల భర్తీకి 227 మంది దరఖాస్తు చేసుకోగా. 180 మందికి అర్హత ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి 29న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11-1:30 మధ్య రాత పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ చాటిన వారిని 1:5 చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ విఠల్, ఏవో వెంకటేశ్వర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నూతన కార్యవర్గం ఎన్నిక

మోపాల్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మండల నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, బద్రినాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటైంది. మండల అధ్యక్షుడిగా మహేశ్వర్‌రెడ్డి(ఎంపీపీఎస్ కంజర), ప్రధాన కార్యదర్శిగా గంగాధర్(జడ్పీహెచ్ఎస్, ముదక్‌పల్లి) ఉపాధ్యక్షుడిగా గణేశ్(జడ్పీహెచ్ఎస్, మోపాల్), ఆర్థిక కార్యదర్శిగా గంగయ్య, మహిళా కార్యదర్శిగా అరుణ, మహిళా కన్వీనర్‌గా చెన్న రమ్య(ఎంపీపీఎస్ వడ్డెర కాలనీ), ఎన్నికయ్యారు.

'భాజపా అంటే భవిష్యత్తు'

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: డిచ్‌పల్లిలో భాజపా మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి బుధవారం పరిశీలించారు. దుకాణదారులు, ఇళ్లకు వెళ్లి ఫోన్ యాప్‌లో పార్టీ సభ్యత్వ నమోదును చేయించారు. అంతకుముందు పండిత్ దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. భాజపా అంటే పిల్లల భవిష్యత్తు, దేశం సురక్షితం అని పేర్కొన్నారు. పద్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, సతీశ్‌రెడ్డి, సురేశ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న చంద్రశేఖర్, దినేశ్ కులాచారి



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖిల్లా జైలు సందర్శన

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఖిల్లా జైలును సందర్శించారు. ఖిల్లా జైలు చరిత్ర, ప్రాముఖ్యాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. దాశరథి కృష్ణమాచార్యను బంధించిన 8 నెంబరు గదిని వీక్షించారు. అందులో రాసిన కవితల గురించి తెలియజేశారు. ఉపాధ్యాయులు గంగాధర్, దేవేందర్, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో తెగుళ్ల నివారణ

మోపాల్, న్యూస్‌టుడే : వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు కనిపిస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని ఏఈవో శరత్ తెలిపారు. బుధవారం చిన్నాపూర్, కాస్బాగ్ తండా గ్రామాలను సందర్శించి వరి పంటలను పరిశీలించారు. వ్యాధి సోకితే ప్లాంటోమైసిన్ 0.4 గ్రాములు, అగ్రిమైసిన్ 4 గ్రా.ల మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఏఈవో భావన, రైతులు ఉన్నారు.



పంటను పరిశీలిస్తున్న ఏఈవోలు



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ మకరందు, ఇతర అధికారులు

స్వచ్ఛతా ప్రతిజ్ఞ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట అధికారులు, సిబ్బంది కమిషనర్ మకరందుతో కలిసి బుధవారం ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, ఏఈలు, ఎస్సైలు, జవాన్‌లు, ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ నిషేధం మున్సిపల్ సిబ్బంది నుంచే మొదలవ్వాలని పుర కమిషనర్ వెంకట్‌నారాయణ సూచించారు. కార్యాలయంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా సిబ్బందికి అవగాహన కల్పించారు. మేనేజర్ ఫారుఖ్, మెప్మా టీఎంసీ శ్రీనివాస్, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, మీర్‌నజీర్‌అలీ, అబ్దుల్లా పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే : బోధన్ రాకాసిపేట్‌లోని పదో వార్డులో డెంగీ కేసు నమోదైందన్న సమాచారంతో పుర సిబ్బంది బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. దోమల మందు పిచికారీ చేయించారు. వైద్యారోగ్య శాఖతో కలిసి ఇంటింటి సర్వే చేపట్టి నీటి తొట్లలో లార్వాను గుర్తించి శుభ్రం చేయించారు.

కంజరలో హత్య

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : మోపాల్ ఠాణా పరిధిలోని కంజరలో బుధవారం రాత్రి ఒకరు హత్యకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. కంజరకు చెందిన సత్యనారాయణ తన కూతురిని అదే గ్రామానికి చెందిన నరహరి కొడుకు గోవింద్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. సత్యనారాయణ కూతురు ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి పగపెంచుకున్న సత్యనారాయణ నరహరి ఇంటికి వెళ్లి కర్రతో ఆయనపై విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ ఘటనలో నరహరి మృతిచెందాడు. దాడిలో సత్యనారాయణతో పాటు మరికొందరు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కాలువలో జారిపడి మృతి

నిజామాబాద్ నేరవిభాగం: నాలుగో ఠాణా పరిధిలో కాలువలో జారిపడి ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మిర్చి కాంపౌండ్‌కు చెందిన అంజయ్య(45) ఆటో నడుపుతుంటాడు. బుధవారం బోర్గాం(పి)లో కాలువ ఒడ్డున మూత్రవిసర్జన చేస్తూ ప్రమాదవశాత్తు జారి కాలువలోపడి చనిపోయాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

ఇందల్‌వాయి: పురుగుల మందు తాగి ఆసుపత్రి పాలైన లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాము(27) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. రాము ఈ నెల 20న కుటుంబానికి భారం కావొద్దని పొలంలో పురుగులమందు తాగారు. కుటుంబీకులు దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు.



చాకలి రాము

నిజామాబాద్ నేరవిభాగం: ఆరో ఠాణా పరిధిలో ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని శాంతినగర్‌కు చెందిన అహ్మద్(61) ఈ నెల 21న అర్సపల్లిలో ప్రమాదానికి గురయ్యారు. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట : జన్నేపల్లిలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఏఎస్సై మోహన్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బళ్లారి సురేశ్ కుటుంబీకులతో కలిసి ఈ నెల 10న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సురేశ్ కూతురు వినీత నిజామాబాద్‌లో నివాసముంటున్నారు. పనిమనిషి పనుల నిమిత్తం ఇంటికి బుధవారం వెళ్లగా వెనక వైపున్న తలుపు తాళం పగిలిపోయి ఉండటాన్ని గమనించి వినీతకు సమాచారం అందించారు. ఆమె వచ్చి చూసి జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పగా ఇంటికి వచ్చారు. 4 తులాల బంగారం, 34 తులాల వెండి ఆభరణాలు, రూ.30 వేల నగదు, చేతి గడియారాలు ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెంజల్(ఎడపల్లి) : కందకుర్తి గోదావరి నదిలో 30 ఏళ్ల యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైనట్లు రెంజల్ ఎస్సై సాయన్న తెలిపారు. గోదావరి పుష్కరఘాట్ వద్ద నీటిలో మృతదేహం తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు.

మహిళా జూదరుల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం: ఒకటో ఠాణా పరిధిలో ఐదుగురు మహిళా జూదరులపై కేసు నమోదైంది. సరస్వతి నగర్‌లోని ఓ ఆసుపత్రి భవనంలో బుధవారం దాడిచేసి రూ.15 వేల నగదు, ఐదు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు చెప్పారు.

సేవా కార్యక్రమాలు విస్తరించాలి



మాట్లాడుతున్న క్లబ్ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ సభ్యులు సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి పేర్కొన్నారు. నగరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. క్లబ్‌లో సభ్యత్వం పెంచాలన్నారు. రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ అశోక్, సహాయ గవర్నర్ జ్ఞాన ప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు పద్మ శ్రీనివాస్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ ర్యాలీ

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కొత్త బస్టాండు నుంచి అంబేడ్కర్‌చౌరస్తా వరకు బుధవారం స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 30న ఓయూలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు మల్లేష్, గంగాధర్, యాదగిరిగౌడ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అదనపు పాలనాధికారి కిరణ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. పోలీస్, రవాణా, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రోడ్లు భవనాలు, ట్రాఫిక్, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులు

ఇసుక టిప్పర్ల పట్టివేత

బోధన్ గ్రామీణం : మంజీరా నది పరివాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను బోధన్ మండలం మావందిఖుర్దు, పెగడాపల్లి శివారులో బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు తహసీల్దార్ విఠల్ తెలిపారు. వీటిని ఠాణాకు తరలించి గనులశాఖకు నివేదించనున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం జప్తు

ఇందల్‌వాయి: గన్నారంతండా నుంచి అక్రమంగా తరలిస్తున్న 7.73 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పట్టుకొని కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీసులకు అప్పగించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వినోద్, ఆర్ఐ మహేష్‌కుమార్ తెలిపారు.

పాఠశాలకు విరాళం

నిజామాబాద్ నగరం: రోటరీ క్లబ్ నిజామాబాద్, శ్రీగ్రసేన్ మహిళా మండలి నిజామాబాద్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శివాజీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 40లీటర్ల స్టీల్ ట్యాంకు, 100 గ్లాసులు తదితరాలను అందజేశారు. విజయ్‌రావు, వాసుదేవరావు, నర్రా రామారావు, సతీష్, గంగారెడ్డి పాల్గొన్నారు.

మోపాల్: సిర్పూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రభాత్ ఫేరీ బ్యాండ్‌ను బుధవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, గాయత్రి, అక్బర్‌బాషా, శ్రీనివాస్, లలిత, కాసర్ల నరేశ్ తదితరులు ఉన్నారు.



నగదు అందిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

బాధితుడికి ఆర్థికసాయం

బోధన్ పట్టణం: మండల విద్యావనరుల కార్యాలయంలో పనిచేసే మెసెంజర్ ఇమామ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఉపాధ్యాయులు స్పందించి రూ.21,111 విరాళం బాధిత కుటుంబానికి అందించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, బాబు, యూసుఫ్‌అలీ ఉన్నారు.

విద్యార్థులకు బూట్ల వితరణ

నిజామాబాద్ గ్రామీణం: రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో బుధవారం మల్లారం జడ్పీహెచ్ఎస్‌లో 272 మంది విద్యార్థులకు బూట్లు, సాక్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ డైరెక్టర్ ఆఫ్ గవర్నర్ రొటేరియన్ శరత్ చౌదరి, నరేష్, జ్ఞానప్రసాద్, అశోక్, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దర్గా ఉర్సు

ఎడపల్లి: మండలకేంద్రంలో హజరత్ అబ్దుల్లా షా హుస్సేన్ దర్గా ఉర్సు మంగళవారం రాత్రి ప్రారంభమైంది. భక్తులు ప్రార్థనలు చేశారు. బుధవారం అర్ధరాత్రి ఉత్సవాలు ముగిశాయి.



దర్గా వద్ద భక్తుల సందడి



ప్రసంగిస్తున్న డీఐఈవో రవికుమార్

విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకోవాలి

కోటగిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలని డీఐఈవో రవికుమార్ పేర్కొన్నారు. కళాశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన వారి వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరయ్యారు. అధ్యాపకుల బోధన తీరు, సిలబస్, ప్రాక్టికల్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఖైసర్ పాషా తదితరులు ఉన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీగా జ్యోతి


కరుణ జ్యోతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రసూల్‌బీ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గోవింద్‌పేట్ అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు గోలి కరుణ జ్యోతి ఉత్తమ అంగన్‌వాడీగా ఎంపికయ్యారు. నిజామాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రసూల్‌బీ చేతుల మీదుగా బుధవారం ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన పోషణ అభియాన్ మాసంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, నిర్వహణలో సేవలకు గాను ప్రభుత్వం ద్వారా గుర్తించి పురస్కారం ఇచ్చారు.

ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

ల్యాబ్ టెక్నీషియన్ నియామకం

ఈనాడు కథనానికి స్పందన

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎట్టకేలకు ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. 'ప్రయోగశాల ఉన్నా.. పరీక్షలు కరవు' అనే శీర్షికన ఈనెల 21న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. ల్యాబ్ టెక్నీషియన్ పార్థసారధిని నియమించారు. ఆయన బుధవారం విధులకు హాజరయ్యారు. 6 నెలలుగా టెక్నీషియన్ లేక అనేక ఇబ్బందులు పాలయిన స్థానికులు..ప్రస్తుతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'ఈనాడు'లో వరుస కథనాలతో ఇద్దరు డాక్టర్లతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ నియామకంతో పీహెచ్‌సీలో సిబ్బంది కొరత తీరింది.

R&B
నిజామాబాద్ జిల్లా


నందిపేట్ బస్టాండ్‌లో లోకేశ్వరం బస్సు

మార్గం సుగమం.. ప్రయాణం నరకం!

- రూ.100 కోట్లతో రెండు జిల్లాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం
- సరిపడా సర్వీసులు నడపని ఆర్టీసీ

జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు నిర్మల్ జిల్లా లోకేశ్వరం వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాసర, ముథోల్ మీదుగా సుమారు 80 నుంచి 100 కిలోమీటర్లు దూరం ప్రయాణించే వారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నందిపేట్ నుంచి గోదావరి నది మీదుగా లోకేశ్వరం వరకు రూ.109 కోట్లకు పైగా నిధులు వెచ్చించి వంతెన, రోడ్డు నిర్మించింది. ప్రయాణ దూరం నందిపేట్ నుంచి లోకేశ్వరానికి తగ్గింది. ప్రస్తుతం రెండు ప్రాంతాల మధ్య దూరం కేవలం 22 కిలోమీటర్లే. కానీ ఆర్టీసీ ఈ మార్గంలో బస్సులు నడిపే విషయంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో ప్రజలకు ప్రయాణ పాట్లు తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, నందిపేట

మూడు ట్రిప్పులే

ప్రస్తుతం రెండు జిల్లాల ప్రజలు భైంసా డిపో నుంచి నడుపుతున్న బస్సులే ఆధారం. కేవలం మూడు ట్రిప్పులు తిరుగుతాయి. పరిమితంగా ఉండటంతో ప్రజలు బస్సుల్లో కిక్కిరిసి రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో నిజామాబాద్ నుంచి నడిపారు. తర్వాత నిలిపివేశారు. ఆర్మూర్ ప్రాంతం నుంచి ఎక్కువ మంది వెళ్తున్నా ఆ డిపో అధికారులు పట్టించుకోవడం లేదు. రోజుకు సగటున 1000 మందికిపైగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. బస్సుల్లో ప్రయాణించడం సాధ్యం కాకపోవడంతో చాలా మంది ప్రైవేటు వాహనాలు ఆశ్రయిస్తున్నారు.

పరిగణనలోకి తీసుకోని ఆర్మూర్ డిపో

ఆర్మూర్, నందిపేట్, డొంకేశ్వర్, మాక్లూర్, నవీపేట్ మండలాల నుంచి చాలా మంది నిర్మల్ జిల్లా లోకేశ్వరం, దిలావర్‌పూర్, నర్సాపూర్ తదితర ప్రాంతాలతో పాటు ముథోల్, భైంసాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడి వారు మార్కెటింగ్, వైద్య తదితర అవసరాలకు నిజామాబాద్ వస్తుంటారు. ప్రజలు నదిలో నాటు పడవలో వచ్చిపోతుంటారు. ఇరు ప్రాంతాల ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నదిపై మూడేళ్ల క్రితం వంతెన, రోడ్డు నిర్మించింది. ఆర్టీసీ బస్సులు నడుస్తాయని అందరు అనుకున్నారు. ఆర్మూర్ డిపో వారు మార్గాన్ని పరిశీలనలోకే తీసుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలలో ప్రయాణిస్తున్నారు.

ఆ రూట్‌ను పరిశీలిస్తాం

ప్రస్తుతం మాకు బస్సుల కొరత ఉంది. అయితే ప్రయాణికుల సమస్యలు తెలుసుకుంటాం. నందిపేట్-లోకేశ్వరం రూట్‌ను పరిశీలిస్తాం. బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటాం.

- రవికుమార్, ఆర్మూర్ డిపో మేనేజరు

కిక్కిరిసి వెళ్తున్నాం..



నందిపేట్, లోకేశ్వరం మార్గంలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అప్పుడప్పుడు వచ్చే భైంసా డిపో బస్సుల్లో కిక్కిరిసి వెళ్లాల్సి వస్తుంది. ఈ మార్గంలో ట్రిప్పులను పెంచాలని చాలా రోజుల నుంచి డిమాండ్ ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

- ఉష్నోద్దీన్, నందిపేట్

R&B
నిర్మల్ జిల్లా

పీవీఆర్ మల్టిప్లెక్స్ (ఆర్మూర్)

ఈనాడు సినిమాలు

స్క్రీన్ 1 **మన్యంధీరుడు:** 1.25, **చిక్లెట్స్:** 4.05, **పైలం పిలగా..:** 6.45, **హైడ్ ఎన్ సీక్:** 9.30

స్క్రీన్ 3 **మత్తు వదలరా 2:** 12.15, 3.15, 6.15, 9.15

స్క్రీన్ 4 **సరిపోదా శనివారం :** 11.30, 3.05, 6.40 **గొర్రె పురాణం:** 4.15, **బొమ్మరిల్లు:** 10.15

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

నందిపేట్, న్యూస్‌టుడే: కుద్వాన్‌పూర్ గ్రామంలో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **-గంగాధర్, కుద్వాన్‌పూర్**

సమాధానం: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా ప్రణాళిక తయారు చేసుకుంటాం. **-మోతీలాల్, ఎల్ఐ**

నందిపేట్, న్యూస్‌టుడే: డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో వరికి తెగుళ్లు వస్తున్నాయి. అధికారులు స్పందించి తగిన సూచనలు ఇవ్వండి. **-ప్రవీణ్, నూత్‌పల్లి**

సమాధానం: వ్యవసాయ క్షేత్ర అధికారికి మీ సమస్య గురించి చెబుతాను. వచ్చి పరిశీలించి తగిన సలహాలు ఇస్తారు.

- జ్యోత్స్న, మండల వ్యవసాయ అధికారిణి

మాక్లూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మాక్లూర్ మండలం సట్లాపూర్ తండాలో వీధి దీపాలు వెలగడం లేదు.

-తారాచంద్, సట్లాపూర్ తండా

సమాధానం: వీధిదీపాలను వెంటనే ఏర్పాటు చేస్తాం. **-ఎంపీవో శ్రీనివాస్**

మాక్లూర్ గ్రామీణం: మాక్లూర్ మండలం కల్లెడలో శునకాల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, పెద్దలపై దాడి చేస్తున్నాయి.

-నరేష్, కల్లెడ

సమాధానం: ఇప్పటికే కొన్ని శునకాలకు మందులు ఇచ్చాం. మరికొన్ని శునకాలు ఉన్నాయి వాటికి కూడా త్వరలోనే మందులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం.

-మోహన్, పంచాయతీ కార్యదర్శి, కల్లెడ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద ఖాళీ స్థలంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చెత్త సేకరణకు రోజు రావడం లేదు.

- సాకేత్, స్థానికులు

సమాధానం: సిబ్బందిని పంపి, శుభ్రం చేయిస్తాం. **- రాజు, పుర కమిషనర్, ఆర్మూర్**

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మామిడిపల్లి ఆదర్శనగర్ కాలనీలోని కాలువల్లో చెత్త పేరుకుపోయింది. దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం.

- రాజేశ్వర్, కాలనీవాసి

సమాధానం : పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాల్వలు శుభ్రం చేయిస్తా. - గజానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్మూర్

ఆర్మూర్ గ్రామీణం: మామిడిపల్లి తిరుమల కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. చెత్తాచెదారం పేరుకుపోయింది. వెంటనే తొలగించాలి. **- రమేష్, కాలనీవాసి**

సమాధానం: కాలువలో చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటా. **- గజానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్మూర్**

ఏర్గట్ల: మా ఇంటి చుట్టూ మురుగునీరు వచ్చి చేరుతోంది. విషయాన్ని అనేక సార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. **- లక్ష్మణ్, ఏర్గట్ల**

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. తాత్కాలికంగా సమస్య పరిష్కరిస్తాం. **- జాకీర్ హుస్సేన్, కార్యదర్శి**

భీమ్‌గల్, న్యూస్‌టుడే: బడాభీమ్‌గల్ శివారులోని రాజరాజేశ్వరాలయం నుంచి కేసీఆర్ కాలనీ వరకు వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను పరిష్కరించాలి. **-కలీం**

సమాధానం: వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

-రజిత, గ్రామ కార్యదర్శి

భీమ్‌గల్: బాపూజీనగర్‌లో ఖాళీ స్థలాల్లో నీళ్లు నిలుస్తున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు తిరుగుతున్నాయి. **- సతీష్**

సమాధానం: పిచ్చి మొక్కలు వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తా.

- వై.రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్

నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ 'విండో' మహాజన సభలో గందరగోళం చోటు చేసుకుంది. పాలకవర్గంలోని కొందరు అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపిస్తూ వేదిక వద్దకు రైతులు దూసుకొచ్చారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఛైర్మన్ బూరొల్ల అశోక్ అధ్యక్షతన బుధవారం సభ ప్రారంభమైన కొద్ది సేపటికే అరుపులు, కేకలతో దద్దరిల్లింది. అధికారులు, డైరెక్టర్లు కలిసి సంఘం డబ్బులను కాజేశారంటూ సభ్యులు విమర్శించారు. విచారణ తూతూ మంత్రంగా సాగుతుందే తప్ప..అవినీతి పరులపై చర్యలు తీసుకోవడం లేదంటూ మండిపడ్డారు. నిధులు రికవరీ చేసే వరకు సభను కొనసాగనివ్వమంటూ వేదిక వద్దకెళ్లారు. పాలకవర్గంతో వాగ్వాదానికి దిగారు. అశోక్ జోక్యం చేసుకొని.. తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టానని, నిధులు చాలా రోజుల క్రితమే దుర్వినియోగమయ్యాయని వివరించారు. మూడు నెలల్లో డబ్బులు రికవరీ చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కర్షకులు శాంతించారు. తర్వాత వైస్ ఛైర్మన్ శేఖర్, మాజీ సీఈవో విష్ణువర్ధన్, డైరెక్టర్ జిట్ట గంగాధర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. విండో దుస్థితికి మీరంటే మీరే కారణమంటూ వ్యక్తిగత దూషణలకు దిగారు. చివరకు అశోక్, మాజీ ఛైర్మన్ కొట్టాల లింగారావు వారిని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో డైరెక్టర్లు కాశీనాథ్‌రావు, రమేష్, ప్రసాద్, అశోక్, గంగారాం, నాయకులు వెంకటేశ్వర్‌రావు, రాజేందర్, లక్ష్మీనారాయణ, దత్తు, అబ్బన్న పాల్గొన్నారు.


వాగ్వాదానికి దిగిన రైతులు

సకాలంలో ఎరువులు అందించాలి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ సూచించారు. ఆర్మూర్ మండలం పెర్కిట్, గోవింద్‌పేట్, పిప్రి సొసైటీల పరిధిలోని ఎరువుల గోదాములను బుధవారం మండల వ్యవసాయాధికారి హరికృష్ణతో కలిసి తనిఖీ చేశారు. పీవోఎస్ మిషన్‌లో రైతుల ఆధార్ నంబరు నమోదు పక్కాగా చేశాకే ఎరువులు విక్రయించాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెర్కిట్ సొసైటీ ఛైర్మన్ పెంట భోజారెడ్డి, కార్యదర్శులు లింబాద్రి, రమేష్, సిబ్బంది ఉన్నారు.

బాల్కొండ: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు. బాల్కొండతో పాటు బోదేపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.


పెర్కిట్ సొసైటీలో రికార్డులు పరిశీలిస్తున్న వాజీద్‌హుస్సేన్

పసుపు పంటలో సస్యరక్షణ అవసరం


గుమ్మిర్యాల్‌లో పంటను పరిశీలిస్తున్న మండల ఉద్యానాధికారి వినాయక్

ఏర్గట్ల, న్యూస్‌టుడే: మండల ఉద్యానాధికారి రుద్ర వినాయక్, పసుపు పరిశోధన సంస్థ కమ్మర్‌పల్లి సీనియర్ శాస్త్రవేత్త డా. మహేందర్‌తో కలిసి మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలోని పసుపు పంటలను బుధవారం పరిశీలించారు. తాటాకు మచ్చ, లద్దె పురుగు, దుంపకుళ్లు, దుంపఈగ, ఆకు మాడు తెగుళ్లను గుర్తించారు. నివారణకు ఎకరాకు మూడు కిలోల వేపపిండి, 3జీ గుళికలు 5-6 కిలోలు, సగం బస్తా చొప్పున యూరియా, పొటాష్ చల్లుకోవాలని సూచించారు. ఏఈవో సాయి సచిన్, రైతులు సోమ రాజారెడ్డి, బద్దం మోహన్, గడ్డం రవి, ఏలేటి రాజారెడ్డి, రాజారెడ్డి, దేవన్న, చిన్న సంజీవ్, గోపిడి నవీన్ ఉన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

నందిపేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర సర్కారు వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు కుద్వాన్‌పూర్ ఎస్సీ, బీసీ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. గదుల్లో కలియ తిరిగారు. సమస్య గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పిల్లలతో కలిసి అల్పాహారం చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ పిల్లలకు నాణ్యమైన విద్యను బోధించాలన్నారు.


పిల్లలతో ముచ్చటిస్తూ అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

క్రీడల్లో కేజీబీవీ బాలికల ప్రతిభ


బహుమతులు, జ్ఞాపికలతో బాలికలు, ఉపాధ్యాయ బృందం

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) బాలికలు ఇటీవల క్షత్రియ పాఠశాలలో జరిగిన అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడా పోటీలో ప్రతిభ చాటారు. మార్చ్‌ఫాస్ట్‌లో ద్వితీయ స్థానం, కబడ్డీ జూనియర్ విభాగంలో ద్వితీయ, ఖోఖో జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానాలు, అథ్లెటిక్స్ పోటీలో 100 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో ఆరు పతకాలు సాధించినట్లు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రత్యేక అధికారిణి నవనీత తెలిపారు. బుధవారం బాలికలను, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీణను ఆమె అభినందించారు.

దీన్ దయాళ్ జయంతి

ఆర్మూర్ పట్టణం: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి నివాళులర్పించారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, గంగాధర్, ద్యాగ ఉదయ్, రాజు, వేణు పాల్గొన్నారు. పట్టణంలోని క్షత్రియ పాఠశాలలో ప్రిన్సిపల్ నవిత ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఆర్మూర్ గ్రామీణం: చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో దీన్ దయాళ్ విగ్రహానికి కార్యదర్శి దేవేందర్, అధ్యాపకులు పూల మాలలు వేశారు. ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ జ్యోత్స్నపాండే పాల్గొన్నారు.


చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో..

క్రీడా దుస్తుల వితరణ



చౌట్‌పల్లి(కమ్మర్‌పల్లి): చౌట్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రేయన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ నిజామాబాద్ ప్రిన్సిపల్ గడ్డం మహేందర్ రూ 35 వేల విలువైన మార్చ్‌ఫాస్ట్ క్రీడా దుస్తులను వితరణ చేశారు. వీటిని మండల విద్యాధికారి ఆంధ్రయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఏపీసీ ఛైర్మన్ కమల, ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీనివాసు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి కస్తూర్బా పాఠశాలకు అవసరమైన మార్చ్ ఫాస్ట్ సామగ్రిని దాత ఏనుగు దయానందరెడ్డి వితరణ చేశారు. 100 మంది విద్యార్థులకు అవసరమైన ట్రాక్ సూట్, క్రీడా దుస్తులు, బూట్లు అందించగా బుధవారం ప్రత్యేకాధికారిణి గంగామణి పిల్లలకు పంపిణీ చేశారు.

అవీ...ఇవీ.. అన్నీ

కుట్టు మిషన్ల అందజేత

నందిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లోని మహిళలకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు శౌరిబాబు తన సొంత ఖర్చులతో ఇచ్చారు. సభ్యులు గోపీనాథ్, నర్సయ్య, బద్దం సాయారెడ్డి, రాజారెడ్డి, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలి

నందిపేట్, న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, కష్టపడి చదవాలని బీబీజీ బంగారు తల్లి సంస్థ ప్రతినిధురాలు అన్నపూర్ణ అన్నారు. డొంకేశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

బాల్కొండ: బాల్కొండలోని సమైక్య కార్యాలయంలో బుధవారం సెర్ప్ సీసీలకు, ఏపీఎంలకు ఆర్మూర్ డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీవో సాయాగౌడ్, అదనపు డీఆర్‌డీవో రవీందర్, డీపీఎంలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కమిషనర్



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్మూర్ డంపింగ్ యార్డులో మొక్కలు నాటారు. పుర కమిషనర్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీరు పూర్ణమౌళి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన పీ. నర్సయ్య తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ చేయాలని నిమ్స్ వైద్యులు సూచించడంతో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను సంప్రదించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ అందజేశారు.

సరకుల పంపిణీ

మాక్లూర్: వెంకటాపూర్‌కు చెందిన దాదన్నగారి నిఖిల్(ఎన్ఆర్ఐ) జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు పేద ప్రజలకు అండగా నిలిచారు. నెల రోజులకు సరిపడా నిత్యవసర సరకులను బుధవారం అందజేశారు.

వారసులను నియమించాలని వినతి

ఏర్గట్ల, న్యూస్‌టుడే: వీఆర్ఏల వారసులను గత ప్రభుత్వం గతేడాదిలో విడుదల చేసిన జీవో 81, 85 ప్రకారం నియమించాని మండలంలోని వీఆర్ఏల వారసులు తహసీల్దారు శ్రీలతకు వినతి పత్రాన్ని అందజేశారు. గత పద్నాలుగు నెలలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి తమను తక్షణమే ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

స్టేడియం నిర్మాణానికి సహకారం

ముప్కాల్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని చైతన్య యువజన సంఘం మైదానంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియానికి అదే గ్రామానికి చెందిన బద్దం నర్సారెడ్డి తన వంతుగా రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. బుధవారం క్రీడా ప్రతినిధులు ఆయనను సత్కరించారు. క్రీడానిర్వాహకులు, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కబడ్డీ గంగాధర్, నునుగొండ అంజయ్య, టి.సాయన్న, గంగారం, సంజీవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఎంఈవోలు

మోర్తాడ్, న్యూస్‌టుడే: మోర్తాడ్ మండలానికి తిమ్మాపూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమ్మిరెడ్డి నూతన ఎంఈవోగా నియమితులయ్యారు. మోర్తాడ్ మండల ఉపాధ్యాయులు ఆయన్ను బుధవారం సన్మానించారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

బాల్కొండ: మెండోరా ఎంఈవోగా దేగామ్ శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ని పీఆర్టీయూ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆర్మూర్ గ్రామీణం: ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ మండల విద్యాశాధికారిగా నియామకం అయ్యారు. విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.


గోడప్రతుల ఆవిష్కరణ

మోర్తాడ్: పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మోర్తాడ్ ప్రభుత్వం జూనియన్ కళాశాలలో కన్వీరన్ మహేశ్ విద్యార్థులతో పోస్టర్లు ఆవిష్కరించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా విద్యార్థి సంఘం నేటిని 50 వసంతాలు పూర్తి చేసుకుందని చెప్పారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు కిషన్, సత్తెక్క పాల్గొన్నారు.

ప్రశస్త్‌లో దివ్యాంగుల వివరాలు నమోదు

కమ్మర్‌పల్లి,న్యూస్‌టుడే: పాఠశాలలో ప్రశస్త యాప్‌తో దివ్యాంగులను గుర్తించాలని ఎంఈవో ఆంధ్రయ్య అన్నారు. కమ్మర్‌పల్లిలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని దివ్యాంగ విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. శిక్షకులు రాజు యాప్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

ఆర్మూర్ గ్రామీణం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల్లో వైకల్యాలను పరిశీలించి ప్రశస్త యాప్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉందని సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా సమన్వయకర్త, సీఎంవో పడకంటి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని మోడల్ (ఆదర్శ) పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త యాప్ గురించి నిర్వహించిన శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, ఐఈఆర్పీలు సునీల్, కిషన్, సురేష్, ఆర్మూర్, ఆలూర్ ఎంఈవోలు రాజగంగారాం, నరేందర్, పెర్కిట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు సంతోష్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

పిల్లలకు టీకాలు వేయించాలి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి గిరిబాబు సూచించారు. ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆరోగ్య కార్యకర్త విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మందులు, రికార్డులు పరిశీలిస్తున్న, అధికారి గిరిబాబు

దంత వైద్య పరీక్షలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ నవనాథపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరాన్ని బుధవారం ఆర్మూర్ లోని జడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించారు. 650 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో పెర్కిట్ పాఠశాలలో నిర్వహించారు. 150 మంది విద్యార్థినులకు దంత వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో క్లబ్‌ల అధ్యక్షులు పృథ్వీరాజ్, పోల్కం వేణు, సభ్యులు రవికుమార్, విజయానంద్, శశిధర్ రెడ్డి, తిరుపతి, శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు వనజ, సంతోష్, అశోక్, నసీరుద్దీన్, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


జడ్పీ బాలికల పాఠశాలలో..



ఇనుప స్తంభాలు తొలగించరూ!

దొన్కల్(మోర్తాడ్), న్యూస్‌టుడే: మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇనుప స్తంభాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 10 ఉన్నాయని, వాటిని తొలగించాలని విద్యుత్ అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. కాలనీలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసినా పాత ఇనుప స్తంభాల నుంచే విద్యుత్తు సరఫరా జరుగుతుందన్నారు. వర్షాకాలంలో ఓ మహిళ విద్యుదాఘాతానికి గురైంది. అయినా అధికారులు మాత్రం అస్సలు పట్టించుకోవడం లేదు. కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు లైన్‌మెన్ రాజ్‌కుమార్ తెలిపారు.